క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

బంగారుపాళెం: మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం, నియోజకవర్గ సమన్వయకర్త పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. అరగొండ రోడ్డు పక్కన గల కామరాజు గార్డెన్స్ ఆవరణలో ఉదయం 9.30 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, నామినేటెడ్ పోస్టు అధ్యక్షులు, డైరెక్టర్లు, అను బంధ సంఘ నాయకులు, పార్టీ కార్యకర్తలు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

పూతలపట్టు: మండలంలోని ఎర్రచెరువుపల్లి ఉన్నత పాఠశాలలో 7 వతరగతి విద్యార్థిని తేజశ్రీ రెండు నెలలుగా బోన్‌క్యాన్సర్‌తో బాధపడుతూ చెన్నైలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆ బాలిక తల్లిదండ్రులు రోజు కూలీలు కావడంతో, వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఉపాధ్యాయులు పాఠశాల తరఫున రూ.26,500 అందజేశారు. మరిన్ని అవసరాలను అందిస్తామని భరోసాను కల్పించారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌గా అక్బర్



పదోన్నతి పత్రం అందుకుంటున్న అక్బర్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో మిట్టూరు సెక్షన్ లైన్‌మెన్ అక్బర్‌కు కొంగారెడ్డిపల్లె లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి లభించింది. దీంతో ఆయన గురువారం ఏఈ మహమ్మద్‌బాషాను కలిసి పదోన్నతి పత్రం తీసుకున్నారు. అక్బర్ స్థానంలో మిట్టూరుకు చిత్తూరు రూరల్ సహాయ లైన్‌మెన్ రాజాకు లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి వచ్చింది. ఆయన ఏఈ రాజేంద్రబాబును కలిసి పదోన్నతి పత్రం అందుకున్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీఓకు సత్కారం



ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్‌ను సత్కరిస్తున్న అధికారులు

తవణంపల్లె: బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌కు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అబ్దుల్‌కలాంఆజాద్‌ను నెల్లూరు జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు రావడంతో రిలీవ్ అయ్యారు. ఆయనకు ఏఓ రమణప్రకాష్ ఆధ్వర్యంలో సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శాలువతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా రమణప్రకాష్

ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.వి. రమణప్రకాష్ ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. అందరి సహకారంతో విధులను నిర్వర్తించి మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆయనకు పంచాయతీ కార్యదర్శులు శాలువ కప్పి, పూలదండలతో ఘన స్వాగతం పలికారు.

వైద్య పరిశోధనలతో సమాజానికి ఫలాలు

గుడుపల్లె: వైద్యరంగంలో రోజురోజుకూ చోటుచేసుకుంటున్న మార్పులు, మొండి వ్యాధులకు మరింత మెరుగైన చికిత్సా పద్ధతులను అన్వేషించే దిశగా పరిశోధనలు చేసి వాటి ఫలితాల ఫలాలు సమాజానికి అందేలా చూడాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నాగేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం పీఈఎస్ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో మూడు రోజుల స్టేట్ లెవల్ రీసెర్చ్ మెథడాలజీ వర్క్‌షాప్ ప్రారంభమైంది.

సరికొత్త వ్యాధులపై పరిశోధనలు

ముఖ్యఅతిథిగా హాజరైన నాగేంద్రప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ వర్క్ షాపులో వివిధ పరిశోధన పద్ధతుల గణాంక విశ్లేషణ, నైతిక పరిగణాలపై లోతైన అవగాహనతో సన్నద్ధం చేసి ఒక లక్ష్యంతో సమగ్రంగా సెషన్లను నిర్వహించాలన్నారు. సరికొత్త వ్యాధులపై పరిశోధనలు చేయాలన్నారు. కోవిడ్ సమయంలో ప్రపంచవ్యాప్తంగా నివారణ మందు, చికిత్స విధానాలపై చేసిన పరిశోధనలను ఉదహరించారు. వైద్య విద్య పరిశోధనలకు పీఈఎస్ కళాశాల అత్యుతమ ప్రతిభకు చిరునామా కావాలని ఆకాంక్షించారు. వైద్య పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కే కొద్దీ వ్యాధులకు చికిత్స మరింత సులువు అవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ క్రిష్ణారావు, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, వైద్య నిపుణులు ర్యాలీ సుబ్రమణ్యం, చిత్ర నాగరాజ్, ప్రవీణ్‌కుమార్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అవ్వా తాతల్లో పింఛనోత్సాహం

- రూ.3 వేలు అందుకున్న లబ్ధిదారులు
- సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం
- పింఛనుదారుల హర్షాతిరేకం
- మండలంలో 9,628 మంది లబ్ధిదారులు



పెంచిన పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

ఐరాల: ఏ ఆధారం లేని పేదల జీవితాల్లో వైఎస్సార్ పింఛన్ కానుక వెలుగులు నింపుతోంది. నా అన్న వారు లేక, ఆదరణ కరువై బతుకుజీవుడా అంటూ జీవితాలను నెట్టుకొస్తున్న పేద, బడుగు వర్గాల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు, వృత్తి పనివారికి నేనున్నాను అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్నారని పింఛనుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచన్‌గా పింఛన్ చేతికిస్తున్నారని సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నెలవారీ పెన్షన్ సొమ్ము పెంపుతో అవ్వాతాతల కళ్లలో ఆనందం తొణికిసలాడుతోంది. వారి ఇంటికి సంక్రాంతి ముందే వచ్చింది. గత టీడీపీ ప్రభుత్వంలో సరిగ్గా 2019 జనవరిలో సామాజిక పింఛను కేవలం రూ.2,000 మాత్రమే అందేది. సరిగ్గా ఐదేళ్ల తర్వాత అంటే 2024 జనవరిలో లబ్ధిదారులు నెలకు రూ.3వేలు చొప్పున పింఛను పొందుతున్నారు. నెలవారీ పింఛన్ సొమ్ము పెరగడంతో తమకు ఆర్థిక భరోసా ఏర్పడిందని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ ఖర్చుల కోసం ఇతరుల వద్ద చేయి చాపాల్సిన అవసరం ఇకపై తమకు లేదని చెబుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని అంటున్నారు. జగనన్న వచ్చాక వలంటీర్లే ఇంటికి వచ్చి దరఖాస్తు తీసుకుని పింఛన్ మంజూరు చేశారంటున్నారు. గతంలో సదరన్ సర్టిఫికెట్లున్నా, మళ్లీ పరీక్ష చేయించుకుని రమ్మని పంపేవారని దివ్యాంగులు టీడీపీ ప్రభుత్వంలో పడిన బాధలను తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను తీసుకొచ్చి, పంచాయతీ రాజ్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. తమకు కేటాయించిన 50 కుటుంబాల్లో ఎవరెవరు ఏ పింఛన్‌కు అర్హులో గుర్తించి, లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుని, గ్రామ సచివాలయాల్లో నమోదు చేయిస్తున్నారు. అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నారు. మండలంలో మొత్తం పెన్షన్‌దారులు 9,628 మంది. వారిలో ఈ నెల నుంచి కొత్తగా పింఛన్లు మంజూరైన వారు 190 మంది ఉన్నారు. ప్రతి నెలా పింఛన్ రూపంలో మండలంలో పింఛనుదారులకు జగన్ ప్రభుత్వం రూ.27,43,5000 చెల్లిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో కేవలం 6, 218 మందికి మాత్రమే అరకొరగా పెన్షన్ అందేది.

నెలకోసారి కొత్త పింఛను

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో పింఛన్ దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి అర్హులైతే ప్రతి నెలకోసారి కొత్త పింఛను మంజూరు చేస్తున్నారు. గతంలో మంజూరైన పింఛన్ తీసుకోవాలంటే పింఛన్‌దారులు పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపు కాయాల్సి వచ్చేది. కరెంట్ లేదని కొంతసేపు, సిగ్నల్స్ లేదని మరికొంతసేపు, సర్వర్ డౌన్ అంటూ ఇంకొంతసేపు కూర్చోబెట్టి చివరికి టైం అయిపోయిందంటూ పంపేసేవారు. ఇలా ప్రతినెలా రెండు, మూడు రోజులు తిరిగితే కానీ పింఛన్ చేతికొచ్చేది కాదని వృద్ధులు వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని వలంటీర్లు ఇంటికే తీసుకొచ్చి పింఛన్‌సొమ్ములు చేతిలో పెడుతున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మాలాంటి పేదలకు మేలు



ఏ ఆసరా లేని మాలాంటి పేదలకు వైఎస్సార్ పింఛన్ పథకం ఎంతో మేలు చేస్తోంది. ఈ నెల నుంచి నెలకు రూ.3 వేలు చొప్పున వృద్ధాప్య పింఛన్ అందిస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. ఎన్నికల్లో జగన్‌బాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఆయనకు పేదల కష్టాలు తెలుసు.

-జగన్నాథయ్య, సీపీపల్లె, ఐరాల

సీఎం మేలు మరువలేను



భర్త చనిపోవడంతో ఆధారం కోల్పోయాను. గ్రామ వలంటీర్ ఇంటికి వచ్చి సంతకం చేయించుకుని, దరఖాస్తు చేసింది. వెంటనే పింఛన్ మంజూరైందని ఇంటికి డబ్బులు తీసుకొచ్చి చేతిలోపెట్టారు. ముఖ్యమంత్రి జగన్ మేలు మరవలేను. ఎప్పటికీ ఆయనే ముఖ్యమంత్రిగా ఉండాలి.

-గౌరి, కామినాయనపల్లె, ఐరాల

ఒకటో తేదీనే వస్తోంది



జగన్‌బాబు మాలాంటి వృద్ధులకు పెద్ద కొడుకుగా మారి వృద్ధాప్య పింఛన్ రూ. 3 వేలకు పెంచారు. అంతేకాదు ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్లే ఇంటికి వచ్చి మరీ పెన్షన్ సొమ్ము ఇస్తున్నారు. అంతేకాకుండా బియ్యం, రేషన్ కూడా ఇంటికే తెచ్చి ఇస్తున్నారు. గతంలో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇప్పుడు మాకు ఎటువంటి ఇబ్బంది లేదు.

- సులోచనమ్మ, సీపీపల్లె, ఐరాల

వృద్ధాప్య పింఛన్ వచ్చింది



గతంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే వయసు తక్కువని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వృద్ధాప్యపు పింఛన్ వయసు పరిమితి 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించడంతో మళ్లీ దరఖాస్తు చేసుకున్నా. సులభంగా నాకు పింఛన్ మంజూరైంది. వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చి వెళ్లారు. సీఎం జగన్ మేలు ఎప్పటికీ మరువను.

- కోదండరెడ్డి, సీపీపల్లె, ఐరాల

కొత్తగా పింఛన్ తీసుకున్నాను



మా ఇంటికి వలంటీర్ స్వయంగా వచ్చి గత నెలలో మీరు పెన్షన్‌కు దరఖాస్తు చేశారు. ఈ నెలలో పెన్షన్ మంజూరైంది అని, పెంచిన పెన్షన్ సొమ్ము రూ.3 వేలు అందించారు. చాలా సంతోషం వేసింది. మొదటిసారి పింఛను సొమ్ము అందుకున్నాను. ఎవరి చుట్టూ తిరగకుండానే ఇదంతా జరిగింది.

- ఎస్‌ఆర్ తాజూన్‌బీ, ఐరాల

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

పులిచెర్ల(కల్లూరు): నిత్యావసర సరుకులు కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డీలర్లతో జేసీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కొలతల్లో తేడాలు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం సన్న రకం బియ్యం సరఫరా చేస్తోందని, ఇదిపూర్తిగా ప్రజలకు సక్రమంగా అందాలన్నారు. అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్ర నాథరెడ్డి, తహసీల్దార్ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

దంపతులకు జైలు శిక్ష



నిందితులు గోపి, చందామరై

పాలసముద్రం : ఇంటి స్థల వివాదం కేసులో దంపతులకు ఒకటిన్నర ఏడాది జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ చిత్తూరు ఒకటో ఏడీఎం కోర్టు జడ్జి మాధవి తీర్పు చెప్పినట్టు కోర్టు కానిస్టేబుల్ బాషా తెలిపారు. మండలంలోని క్రిష్ణజమ్మాపురం పంచాయతీ కొల్లిరెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన గోపి (42), చందామరై(38) దంపతులు అదే గ్రామానికి చెందిన వ్యక్తులతో ఇంటి స్థలం విషయంపై గొడవ పడ్డారు. ఈ క్రమంలో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దంపతులను అరెస్టు చేశారు. ఈ కేసు రెండు సంవత్సరాలుగా విచారణ జరిపిన జడ్జి మాధవి గురువారం తీర్పు వెలువరించారు.

ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం





తవణంపల్లె: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్, ఐరాల: వైద్యసేవల్లో డాక్టర్ పూర్ణలత

తవణంపల్లె: గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవించడం తల్లీబిడ్డకు శ్రేయస్కరమని వైద్యాధికారులు మోహన్‌వేలు, వినయ్‌కుమార్ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నలిశెట్టిపల్లె, జొన్నగురకల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. జొన్నగురకల గ్రామంలో డాక్టర్ మోహన్‌వేలు 53 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నలిశెట్టిపల్లెలో డాక్టర్ వినయ్‌కుమార్ 67 మంది రోగులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. డాక్టర్ మోహన్‌వేలు మాట్లాడుతూ గర్భిణులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదే విధంగా బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, డీఈఓలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం లక్ష్యం

ఐరాల: మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నాదే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని ఇరువారంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందాం



ఎన్నికల ప్రచారంలో విజయానందరెడ్డి



స్థానికులతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: పేదల కష్టాలను తీరుస్తూ వారి సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందామని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. చవటపల్లెలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. ఒకటో తేదీన వలంటీర్లు ఇంటికే వెళ్లి పింఛన్ అందిస్తుండడంపై అవ్వా, తాతలు సంతోషం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలు తెలియజేశారు. డివిజన్ల వారీగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం అధికార యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. ప్రజల వద్దకే పాలన నినాదంతో ప్రతి పనికీ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే చోట సమస్యలు పరిష్కరించేలా సచివాలయ వ్యవస్థను రూపొందించారని చెప్పారు. మేనిఫెస్టోలోని హామీలన్నీ నెరవేర్చిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. దాదాపు ఐదేళ్లలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందించిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఉద్యోగాల కల్పనలో, తలసరి ఆదాయాన్ని పెంచటంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. సంక్షేమ ప్రభుత్వంపై ప్రతిపక్షలు విమర్శలు చేస్తున్నారని రానున్న ఎన్నికల్లో వారు ఖాళీ అవుతారన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, టౌన్ బ్యాంకు ఛైర్మన్ రాంగణేష్, నగర పార్టీ అధ్యక్షులు టిమ్ము, స్థానిక కార్పొరేటర్ సహదేవన్, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అండగా నిలవండి

గుడిపాల: దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి చేపట్టేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని, ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. మండలంలోని మొగరాళ్లపల్లె పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. రానున్న ఎన్నికల్లో మా భవిష్యత బాటలు వేసిన వైఎస్సార్‌సీపీకు ఓటు వేస్తామని ప్రజలు తెలిపారు. ఇదిలా ఉండగా ఇంటింటికి వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్టీ జెండాలను చేతపట్టుకొని, ఫ్యాన్ గుర్తును ప్రజలకు చూపిస్తూ సందడి చేశారు. అనంతరం విజయానందరెడ్డి మాట్లాడుతో గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ రావాలన్నా జన్మభూమి కమిటీల సభ్యుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, గోళ్లహరిప్రసాద్, మధుసూదన్‌రాయల్, శిలంబరసన్, విక్టర్, మోహన్, లారెన్స్, థామస్, వినోద్, దేవేంద్ర, రూబన్, రమణ, కాలిమేఘం, చిట్టి, దీన పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందాం





ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌తో సెల్ఫీలు తీసుకుంటున్న మహిళలు

- పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్

యాదమరి: ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారని పూతలపట్టు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. అలాంటి ముఖ్యమంత్రిని మళ్లీ సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని శివపార్వతి కల్యాణ మండపంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో డాక్టర్ సునీల్‌కుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో మనమందరం కలసి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నానని, మీరు అందరు సిద్దమా అని ప్రశ్నించగా ఒక్కసారిగా నాయకులందరూ సిద్ధం అంటూ ముక్త కంఠంతో చెప్పారు. 2014 ఎన్నికలలో తనను ఎమ్మెల్యేగా గెలిపించినది యాదమరి మండల ప్రజలేనని గుర్తుచేసుకున్నారు. నియోజకవర్గంలో ఐదు మండలాల్లోని ప్రజల అండదండలతో ఎమ్మెల్యేగా గెలుపొందాను. కానీ ఈ విజయంలో యాదమరి మండలం నుంచి కాస్త అధికంగా ఓట్లు వచ్చాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఐక్యతను చూస్తుంటే ఇప్పడే మనం గెలిచినంత సంతోషంగా ఉందన్నారు.

పథకాలే ప్రచార అస్త్రాలు

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి తెలిపారు. ఎన్నికలలో జగనన్న ఇచ్చిన పథకాలే ప్రచార అస్త్రాలని చెప్పారు. ముఖ్యంగా గ్రామాలలో 99 శాతం మంది జగనన్న పథకాలు తీసుకున్నారని తెలిపారు. వారు అందరు జగనన్నకు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మనోహర్, మైనారిటీ అధ్యక్షులు కబీర్ బాషా, వైస్ ఎంపీపీలు హరనారాయణ రెడ్డి, రవీంద్రబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు అందరు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటమి తప్పదు

మండల కేంద్రంలో డాక్టర్ సునీల్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఇంత వరకూ ఏ ముఖ్యమంత్రీ చేయనన్ని అభివృద్ధి పనులు జగనన్న చేశారని తెలిపారు. ఎన్నికలలో టీడీపీ, జనసేన కలిసి వచ్చినా ఓటమి తప్పదని, వారు ఓట్లు అడిగితే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. గతంలో చంద్రబాబు ఎన్నడూ ప్రజలకు ఎలాంటి మంచి చేయలేదని వారి ముఖం పైన చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా చిత్తూరు నగరంలో గురువారం పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీదుగా గిరింపేట, ఎంఎస్ ఆర్ కూడలి, గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగించారు. - చిత్తూరు రూరల్

మహా కుంభాభిషేకం



కుంభాభిషేకం చేస్తున్న వేద పండితులు

కార్వేటినగరం : స్కంధ పుష్కరిణి సమీపంలో కుమార గిరిపై వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో గురువారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. మూలస్థాన గోపురంతోపాటు నవగ్రహ ఆలయం శిఖరాన్ని ప్రత్యేక పూజలు చేసి కలశాలలోని పవిత్ర జలాలతో అభిషేకించారు.



ప్రత్యేక అలంకరణలో వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి